క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


మంగమ్మ

గార్ల : ఎంపీడీఓగా మంగమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ఎంపీడీఓగా పనిచేసిన మంగమ్మ గార్ల ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు.

తొర్రూరు ఎంపీడీఓగా ఎస్‌కే సిలార్ సాహెబ్



తొర్రూరు : తొర్రూరు ఎంపీడీఓగా ఎస్‌కే సిలార్ సాహెబ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు తొర్రూరు ఎంపీడీఓగా పని చేసిన సింగారపు కుమార్ ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓకు మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం


నియామక పత్రం అందజేస్తున్న రమేష్

మరిపెడ : బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా సొంటి రజనీకాంత్‌ను నియమించినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బింగి రమేష్‌యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విటమిన్-ఏ ద్రావణం పంపిణీ



డోర్నకల్ : మండలంలోని పలు గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు విటమిన్-ఏ ద్రావణం పంపిణీ చేశారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో రేచీకటి నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విటమిన్-ఏ ద్రావణాన్ని పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు ద్రావణాన్ని తాగించారు.

కష్టపడి చదివితే భవిష్యత్



డోర్నకల్ : విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ పొందవచ్చని డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ కార్యక్రమానికి హాజరై ఎస్సై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కేలోత్ సాయికుమార్, మండల ఇన్‌చార్జ్ గుగులోత్ సూర్యప్రకాష్, హెచ్‌ఎం నర్సింహారావు పాల్గొన్నారు.

'మాక్ అసెంబ్లీ'



నెల్లికుదురు : మండలంలోని మునిగలవీడు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించినట్లు హెచ్‌ఎం స్వప్న తెలిపారు. ప్రభుత్వ శాఖలు వాటి పనితీరు అమలుపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వ పరిపాలన పని విధానం, అభివృద్ధిపై అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠశాలను నడిపించి తమ తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.లక్ష్మి, ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీనివాస్, రవికుమార్, లక్ష్మి, రాధిక, కవిత పాల్గొన్నారు.

'రాజకీయ కక్షతోనే ఆరోపణ'

బయ్యారం : రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కొందరు డైరెక్టర్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బయ్యారం సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బయ్యారంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, భిక్షం, నాగమణి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


నెల్లికుదురు: రైతులకు పరిహారం ఇవ్వాలని వేడుకుంటున్న ఎంపీటీసీ


తొర్రూరు: మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

తొర్రూరు : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని ఎంపీపీ తూర్పాటి చిన్నఅంజయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు. కాగా ఎంపీటీసీలు సమావేశంపై ఆసక్తి చూపకపోగా కేవలం సంతకాలకే పరిమితమయ్యారు. ప్రజాప్రతినిధులకు సకాలంలో సమాచారం అందలేదని, వారంలో తిరిగి సర్వసభ్య సమావేశం నిర్వహించాలని వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో జరిగిన పనులపై సమీక్ష నిర్వహించి సమావేశాన్ని ముగించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలకు మొదటి ప్రాధాన్యమివ్వాలని ఎంపీపీ అంజయ్య పేర్కొన్నారు. నాయబ్ తహసీల్దార్ నర్సయ్య, సూపరింటెండెంట్ గోపాల్‌రావు, సీడీపీఓ హైమావతి, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'గ్రీన్ ఫీల్డ్ హైవే రైతులకు న్యాయం చేయాలి'

నెల్లికుదురు : గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండలంలోని ఆలేరు, నర్సింహులగూడెం, చిన్నముప్పారం గ్రామాలకు చెందిన రైతులకు న్యాయం చేయాలని ఎంపీటీసీలు వేశాల కృష్ణయ్య, కదిర జగన్, పెరుమాండ్ల గుట్టయ్య, గుగులోత్ మదన్ సభ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. హైవేలో సాగు భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం పక్క జిల్లాలో చెల్లించిన విధంగా ఇక్కడి రైతులకు చెల్లించాలని తహసీల్దార్ రాజుకు వివరించారు. నర్సింహులగూడెం గ్రామ పరిధిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎదుట హైవే నిర్మాణ క్యాంపును గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని, గ్రామస్తులు, ఆలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. క్యాంపును అక్కడనుంచి ఎత్తేయాలని వారు సభదృష్టికి తెచ్చారు. వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన మండలంలోని వస్రాంతండా మాజీ సర్పంచ్ గుగులోత్ జయమ్మకు సభ సంతాపం తెలిపి మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం


సదస్సులో మాట్లాడుతున్న అశోక్

కురవి : విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని, చదువుతో సామాన్యుడు శక్తివంతంగా మారవచ్చని సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మంగళవారం సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య గిరిజన మోడల్ గురుకుల పాఠశాలతోపాటు సీరోలు జెడ్పీ హైస్కూల్, చింతపల్లి హైస్కూల్ విద్యార్థులకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీబచావో.. బేటీపడావో కార్యక్రమంలో భాగంగా ప్రేరణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాస్త్రీయ ప్రణాళిక పునఃశ్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చని తెలిపారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద మాట్లాడుతూ.. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పదేళ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ చైతన్య, జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు అరుణ, ఫైనాన్షియల్ లిటరసీ బాధ్యురాలు సంధ్యారాణి, రాకేష్, ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరుణపై దాడి హేయం


మాట్లాడుతున్న ఆర్యవైశ్య నాయకులు

మహబూబాబాద్ రూరల్ : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై దాడి విచారకరమని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నాళ్ల లక్ష్మీనరసింహారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవీ ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో లోటుపాట్లు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి, కానీ ఆర్యవైశ్య నాయకురాలు అరుణపై దాడి చేయడం సరికాదని, రైతుల రూపంలో కొందరు గిట్టని వారు ఆమెపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఆర్యవైశ్య రాష్ట్ర సంఘం కార్యదర్శి ప్రతాపని పాండురంగయ్య, గిరిధర్, కొండ్లె సూరయ్య, నాళ్ల వీరన్న, జంగాల సదాశివుడు, మాశెట్టి రవికుమార్, ప్రసాద్, మనాది రాజేష్, సోమన్న, రమేష్, కిరణ్, గెల్లి మురళి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మిర్చి రైతుల కన్నెర్ర

- మానుకోట వ్యవసాయ మార్కెట్ ఎదుట రాస్తారోకో


మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మహబూబాబాద్ రూరల్: వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి మిర్చి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపిస్తూ రైతులు రాస్తారోకో చేసిన ఘటన మానుకోట వ్యవసాయ మార్కెట్ వద్ద మంగళవారం జరిగింది. ఈ–నామ్ సర్వర్ డౌన్ ఉందని చెప్పి మోసం చేస్తున్నారని యార్డు ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలు స్తంభించాయి. పలువురు రైతులు మాట్లాడుతూ.. సుమారు 20వేలపైగా మిర్చి బస్తాలు రాగా 2,747 క్వింటాళ్లు (6,868 బస్తాలు) కొనుగోళ్లు జరిగాయన్నారు. క్వింటా మిర్చి గరిష్ట ధర రూ.21,689 పలుకగా, మోడల్ ధర రూ.19,225, కనిష్ట ధర రూ.10,700 పలికిందని, ఎక్కువ శాతం మిర్చిని రూ.15 వేల నుంచి రూ.16 వేలకే కొనుగోలు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు కుమ్మక్కై తక్కువ ధర తో కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ దేవేందర్, ఎస్సైలు పవన్ కుమార్, రామారావు, పోలీసు సిబ్బంది మార్కెట్ వద్దకు వచ్చి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మార్కెట్ సెక్రటరీ షంషీర్‌తో మాట్లాడించడంతో రైతులు ఆందోళన విరమించారు.

రూ.4వేలు తగ్గించారు



మార్కెట్‌కు 60 మేలురం మిర్చి బస్తాలు, 27 తాలు రకం మిర్చి బస్తాలు తీసుకొచ్చాను. ఒక్కరోజు వ్యవధిలోనే క్వింటాకు రూ.4వేలు తగ్గించి వ్యాపారులు కొనుగోలు జరిపి రైతులను మోసం చేశారు.

– భూక్య సోమ్లా, రైతు, సురేష్ నగర్, గూడూరు

రైతుల పరిస్థితి దారుణం



మార్కెట్‌కు మూడు రోజుల క్రితం 43 బస్తాల మేలురకం మిర్చి, 10 బస్తాల తాలురకం మిర్చి తీసుకొచ్చాను. వ్యాపారులు పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లోనే పడిగాపులు పడుతూ అవస్థలు పడుతున్నాం. రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. పట్టించుకునే వారు కరువయ్యారు.

– బానోత్ శ్రీనివాస్, రైతు, పెద్ద రామోజీ తండా, మానుకోట

పరామర్శ

నెల్లికుదురు : మండలంలోని వస్రాం తండాకు చెందిన మాజీ సర్పంచ్ గుగులోత్ జయ ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. మంగళవారం విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో పాల్గొని జయ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.కాగా మృతిచెందిన జయ అవయవాలను జనజీవన ప్రభుత్వ సంస్థకు దానం చేసి మానవత్వం చాటుకోవడం అభినందనీయమని మృతురాలి భర్త మాన్‌సింగ్‌ను పలువురు ప్రశంసించారు.

విద్యార్థుల కుటుంబాలకు చేయూత

తొర్రూరు రూరల్ : మండలంలోని అమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. కాగా మంగళవారం బాధిత కుటుంబాలకు రూ.10వేల నగదు, బియ్యాన్ని పాఠశాల యజమాన్యం అందించి చేయూత ఇచ్చారు.

ఎస్పీని కలిసిన సీఐలు




ఎస్పీకి మొక్క అందిస్తున్న దేవేందర్ సర్వయ్య సంజీవ్

మహబూబాబాద్ రూరల్ : జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రాంసింగ్ జీ పాటిల్‌ను విధుల్లో చేరిన మహబూబాబాద్ టౌన్, రూరల్, తొర్రూరు సీఐలు దేవేందర్, సర్వయ్య, సంజీవ్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

ప్రైవేటీకరణను నిలిపివేయాలి


నెహ్రూసెంటర్ : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాగన్న


నెల్లికుదురు: మాట్లాడుతున్న ఇస్సంపెల్లి సైదులు

నెహ్రూసెంటర్: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో సమ్మె వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ సంపదను ప్రైవేటుపరం చేస్తామంటే కార్మికులు చూస్తూ ఊరుకోబోరని, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 16వ తేదీన జరగనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయాలి

కేసముద్రం/బయ్యారం/డోర్నకల్/కురవి/గార్ల/నెల్లికుదురు : ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కేసముద్రంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి హలావత్ లింగన్న, బయ్యారంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, కురవిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆకుల రాజు, గార్లలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు, నెల్లికుదురులో సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన సమ్మె వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయా మండల కేంద్రంల్లో ఆవిష్కరించారు.



గార్ల: ప్రచారం చేస్తున్న సక్రు


కురవి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతు వ్యతిరేక విధానాలపై నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తొర్రూరు : కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. ఢిల్లీలో చేపట్టిన రైతాంగ ఉద్యమ సమయంలో ప్రధాని ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర అందించాలని, దానికై చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఎం జిల్లా నాయకుడు బొల్లం అశోక్, న్యూడెమోక్రసీ నేత ఆలకుంట్ల సాయిలు, నాయకులు ఓమ భిక్షపతి, ముంజంపల్లి వీరన్న, ఎండీ యాకూబ్, రాములు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి


అభివాదం చేస్తున్న బోడ లక్ష్మణ్ నాయక్, తదితరులు

- హాజరుకానున్న ఎంపీ, జెడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే


గార్ల: వినతిపత్రం అందజేస్తున్న వెంకట్‌లాల్

మహబూబాబాద్ రూరల్ : సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి మహోత్సవ వేడుకలు మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని సేవాలాల్ ప్రాంగణం(అనంతారం గుట్ట) వద్ద రేపు(గురువారం) ఘనంగా నిర్వహిస్తున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ లక్ష్మణ్ నాయక్ అన్నారు. సేవాలాల్ జయంతి వేడుకల సన్నాహక సమావేశం సేవాలాల్ ప్రాంగణం వద్ద మంగళవారం నిర్వహించగా లక్ష్మణ్ నాయక్ మాట్లాడారు.సేవాలాల్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమంలో జిల్లాలోని యావత్ బంజారాలు ఇతర సామాజిక వర్గాల ప్రజలు, ప్రజాసంఘాల బాధ్యులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ హాజరవుతాని తెలిపారు. జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

జయంతిని అధికారికంగా నిర్వహించాలి

గార్ల : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు నాయబ్ తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఆయన కోరారు. టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.శివనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, గంగావత్ శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

చిన్నగూడూరు : సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో సేవాలాల్ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ధరావత్ మోహన్, ఉపాధ్యక్షుడిగా బానోత్ రవి నాయక్, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ రవికుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి ఉత్సవాలను అన్ని తండాలలో ఘనంగా నిర్వహించేలా కృషిచేస్తామన్నారు.

క్రైం కార్నర్

గడ్డి మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నం

గార్ల : పొలం వద్ద ఓ రైతు పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం గ్యామా తండాలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం వివరాలు.. మండలంలోని మర్రిగూడెం పంచాయతీ గ్యామాతండాకు చెందిన భూక్యా శ్రీను తనకున్న ఎకరంతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని మిరప సాగుచేశాడు.తోటకు తెచ్చిన పెట్టుబడి అప్పు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై, మధ్యాహ్నం తోటకు వెళ్లి గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పక్క రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో శ్రీనును వెంటనే సీహెచ్‌సీకి తరలించారు. కాగా మెరుగైన వైద్యంకోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్ హనుమంతరావు తెలిపారు.

అత్యాచార కేసు నమోదు.. నిందితుడి అరెస్ట్

డోర్నకల్ : గార్ల మండలానికి చెందిన వివాహితపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గార్ల మండలానికి చెందిన మహిళకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వ్యక్తితో వివాహం కాగా, కొద్ది రోజుల క్రితం తన సొంత గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం సదరు మహిళ ఖమ్మం వెళ్లగా అక్కడ డోర్నకల్ మండలం తెల్లబండతండాకు చెందిన భూక్యా సురేష్ పరిచయం కాగా అదే రోజు రాత్రి సురేష్ మహిళను తన గ్రామంలో దింపుతానంటూ బైక్‌పై మరో దారిలో తీసుకెళ్లి మార్గమధ్యలో నిర్మానుష్య ప్రదేశంలో బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. ఘటనపై మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

గూడ్స్ వాహనం–ఆటో ఢీ.. ఒకరి మృతి.. ఇరువురికి గాయాలు

నెల్లికుదురు : గూడ్స్ వాహనం, ప్యాసింజర్ ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలోని క్రాస్ రోడ్ వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తొర్రూరు నుంచి మహబూబాబాద్ వైపునకు ప్యాసింజర్లతో వెళ్తున్న ఆటో నెల్లికుదురు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గూడ్స్ వాహనం ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడన్నారు. గాయపడిన ఇద్దరిలో ఓ మహిళకు సీరియస్‌గా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడి, గాయపడిన వారి వివరాలు తెలియాల్సింది.

సంక్షిప్త సమాచారం

మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలి రాజీనామా

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యురాలు అనితారాణి తన రాజీనామా పత్రాన్ని కమిషనర్ ప్రసన్నరాణికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైనార్టీలపై జరుగుతున్న వివక్ష వల్లే స్వచ్ఛందంగా రాజీనామా చేశానన్నారు.

చేతిపంపునకు మరమ్మతు

మరిపెడ రూరల్ : తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా మండలంలోని తానంచర్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను రిపేర్ చేయించనున్నట్లు గ్రామ కార్యదర్శి మౌనిక మంగళవారం తెలిపారు.

నల్లగొండ సభకు తరలిన నాయకులు

పెద్దవంగర /కురవి : కృష్ణా జలాల హక్కుల సాధనకై నల్లగొండలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగ సభకు మంగళవారం పెద్దవంగర, కురవి మండలాల్లోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

కస్తూర్బాలో సామాజిక తనిఖీ

డోర్నకల్ : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఆర్థిక, సామాజిక అధ్యయనాల బృందం సామాజిక తనిఖీ నిర్వహించింది. బృందం రీసెర్చ్ అధికారి సంపత్‌రావు, సూపర్‌వైజింగ్ అధికారులు అనూష, శృతి ఆధ్వర్యంలో పాఠశాలలో సర్వశిక్ష అభియాన్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలించారు. పాఠశాలలోని వసతులను పరిశీలించి బాలికలు, బోధన, బోధనేతర సిబ్బందితో వేర్వేరుగా మాట్లాడారు. ఎస్‌ఓ మున్నీ పాల్గొన్నారు.

జనుము పంట సందర్శన

మరిపెడ రూరల్ : కోతుల బెడదను తట్టుకోలేక మండలంలోని ఓ కౌలు రైతు విభిన్న రీతిలో సాగు చేసిన జనుము పంటను ఏఈఓ శ్వేతతో పాటు పలువురు రైతులు మంగళవారం సందర్శించారు. జనుము పంటకు పెద్దగా కోతుల బెడద ఉండదని, లాభాలు రాకపోయిన, పెట్టుబడి, నష్టం ఉండదని కౌలు రైతు చెబుతున్నాడు. కోతుల బెడదను నివారించి రైతులను రక్షించాలని రైతు వీరస్వామి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.

ఎల్టా జిల్లా స్థాయి పోటీల నిర్వహణ

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా స్థాయి ఇంగ్లిష్ స్పెల్ విజర్డ్ డ్రామా పోటీలను ఎల్టా మహబూబాబాద్ ఆధ్వర్యంలో జమాండ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకు నాన్ రెసిడెన్షియల్ విభాగం నుంచి స్పెల్ విజర్డ్ పోటీలకు 16 మండలాల విద్యార్థులు పోటీపడ్డారు.డీఈఓ రామారావు, బ్రహ్మం, రామ్మోహన్ రావు, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం అధ్యక్షతన ఫేర్‌వేల్ డే నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సమ్మెట సత్యనారాయణ, జిల్లా పరిధిలోని వివిధ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణపై అవగాహన

గార్ల : శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే ఎంతో ప్రమాదకరమని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ఎల్లయ్య అన్నారు. కుష్ఠు నివారణ పక్షోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి మందులు వాడితే అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. సదస్సుల్లో హెచ్‌ఎం నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ రాధాకృష్ణ, వైద్యసిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

డోర్నకల్ : డోర్నకల్ శివారు బంకట్‌సింగ్ తండాకు చెందిన జాటోత్ జెమిని నాయక్ మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో ప్రతిభ కనబరిచాడు. 99.23 పర్సంటైల్‌తో 300కు 243 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు.

విద్యుత్ అధికారులకు సన్మానం

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉచిత విద్యుత్ పథకానికి ప్రజలు హారతి పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు శంతన్ రామరాజు, మేనక అన్నారు. విద్యుత్ అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే చేసిన నేపథ్యంలో ఆ శాఖ అధికారులను కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చినట్లుగానే 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న మహబూబాబాద్ టౌన్-2 ఏఈ నవ్యశ్రీ, లైన్‌మన్ సురేష్, సిరి సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. బీసీ కాలనీ ప్రజలు వంగాల సోమనర్సయ్య చారి, వాంకుడోత్ సురేష్, శ్రీపాల్ రెడ్డి, షేక్ ఖలీల్, శ్యామలరావు, సోల్జర్ అజారుద్దీన్, జనార్దన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గృహజ్యోతి సర్వే

కురవి : గృహజ్యోతి పథకంలో భాగంగా కురవి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం సర్వే కొనసాగించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం ఆశాఖ అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శిబిరం ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో లైన్‌మన్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి దివాకర్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.